
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 28 మార్చి 2024
5
తిరుపతి



శ్రీవారి సేవలో జస్టిస్ డివై చంద్రచూడ్

ప్రజాశక్తి - తిరుమల



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ డివై చంద్రచూడ్ బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు, ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు ఈవో ఎవి ధర్మారెడ్డి, ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు శ్రీఆరి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను, డైరీ, క్యాలెండర్, అగబత్తులు, పంచగవ్య ఉత్పత్తులను అందజేశారు.

సిద్ధం కండి.. జగన్‌ను ఓడించండి..!



50 ఏళ్లకే బీసీలకు పింఛన్
నగరిలో ప్రతి ఎకరాకు సాగునీరు
చేనేతలకు ప్రత్యేక పాలసీ, టెక్స్‌టైల్ పార్కు
పలమనేరు, నగరి 'ప్రజాగళం' సభల్లో చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పలమనేరు

'యాభై ఏళ్లకే బీసీలకు పింఛన్' ఇస్తానని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ ఇచ్చారు. సొంత నియోజకవర్గమైన కుప్పంలో రెండు రోజుల పర్యటన ముగించుకుని బుధవారం ఉదయం పలమనేరు, సాయంత్రం నగరిలో ఎన్నికల సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వస్తే పవర్‌లూమ్స్, చేనేత కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇస్తామన్నారు. నగరిలో టెక్స్‌టైల్ పార్కు తీసుకొస్తామన్నారు. 50 ఏళ్లు నిండిన బిసీలకు పింఛన్ ఇస్తామన్నారు. రైతులకు అన్నదాత పథకం కింద ప్రతి ఏటా 20వేలు జమ చేస్తూ, డ్రిప్, సబ్సిడీలు ఇస్తూ తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. నేతం సుగర్ ఫ్యాక్టరీ ఇవ్వాల్సిన బకాయిలను వడ్డీతో సహా ఇప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 'దీపం' పథకం కింద ఏడాదికి మహిళలకు మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామన్నారు. బస్సు సౌకర్యం ఉచితంగా కల్పిస్తామన్నారు. అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక తొమ్మిదిసార్లు కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లను పెట్టి పేదవాని కడుపు నింపే కార్యక్రమం చేపడతామన్నారు. 'సిద్ధం' బోర్డు పెట్టి అందరినీ మోసం చేస్తున్నారని, మేము ఇపుడు సిద్ధమయ్యాం మిమ్మల్ని ఇంటికి పంపడానికి అని రాయలసీమలో ప్రతి ఒక్కరూ జగన్మోహన్‌రెడ్డిని నిలదీయండి..' అని పిలుపునిచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేస్తానన్నారు. నగరిలో టెక్స్‌టైల్ పార్కు పెట్టి చేనేతలను ఆదుకుంటామన్నారు. వడమాలపేటకు పారిశ్రామికవాడ తీసుకొస్తానన్నారు. నగరిలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామన్నారు. నగరి ఎంఎల్‌ఎ ఆర్‌కె రోజా ఓ సాటి మహిళకు ఛైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తానని 40 లక్షలు డబ్బు తీసుకున్నారన్నారు. చిత్తూరు ఎంపి అభ్యర్థి దుగ్గిమళ్ల ప్రసాద్‌రావు, పలమనేరు అసెంబ్లీ అభ్యర్థి ఎన్.అమరనాథ్‌రెడ్డి, నగరి అసెంబ్లీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, సత్యవేడు, జీడీనెల్లూరు అసెంబ్లీల అభ్యర్థులు ఆదిమూలం, థామస్, పార్టీ జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ పాల్గొన్నారు. అక్కడనుంచి అన్నమయ్య జిల్లాకు బయల్దేరి వెళ్లారు. నగరిలో టిడిపి నాయకులు గంజి మాధవయ్య, గాలి జీవరత్నం నాయుడు, చినబాబు, డిజి ధనపాల్, ఎంఎన్ ధనపాల్ పాల్గొన్నారు.

పలమనేరులో మాట్లాడుతూ రైతులకు సబ్సిడీలు అందట్లేదని, బిందు సేద్యం పరికరాలు అందుతున్నాయా? అని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నుంచి రుణాలు అందాయా? అని సభికులను అడిగారు. మీ బతుకుల్లో చీకటి నింపిన వ్యక్తులను గుర్తించాలని, ముసుగు వీరుడు పరదాలు దాటి బయటకు వస్తున్నాడని, జగన్‌కు ఖాళీ వీధులు స్వాగతం పలకాలన్నారు. ఒక్కసీమ ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. టిడిపి హయాంలో 90 శాతం ప్రాజెక్టులను పూర్తిచేస్తే, జగన్ 10శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. ఉమ్మడి చిత్తూరులో 25 ప్రాజెక్టులను జగన్ రద్దు చేశారన్నారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు మేమంతా సిద్ధం అని జనం రాయలసీమకు రాకుండా అడ్డుకోవాలన్నారు. ప్రజాగళాన్ని మొదటగా పలమనేరులో ప్రారంభించానని, పలమనేరు మీటింగ్ సూపర్‌హిట్ అని, ఎక్కడ చూసినా జనమేనన్నారు. రాష్ట్రం కోసం ఎన్డీఎలో చేరితే మమ్మల్ని జగన్ విమర్శిస్తున్నాడని, తాము గతంలో ఎన్డీయేలో ఉన్నపుడు మైనార్టీలకు అన్యాయం జరగలేదన్నారు. ఎక్కడ భూములు కనిపించినా వైసిపి నాయకులు వదలట్లేదని, ఆలయ భూములను కబ్జా చేస్తున్నారని, చివరికి ఇళ్లనూ కబ్జా చేసే పరిస్థితి వస్తుందన్నారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా చేస్తానని, బెంగుళూరు, చెన్నయ్ నగరాలను తలపించేలా అభివృద్ధి సాధించే రంగాలను తీసుకొస్తానన్నారు.

మీడియా వాహనానికి తృటిలో తప్పిన పెను ప్రమాదం

వి.కోట : కుప్పం నుంచి పలమనేరుకు వెళుతున్న మీడియా వాహనం వి.కోటలో రోడ్డు ప్రమాదానికి గురయ్యింది. వి.కోట పట్టణ సమీపంలోని ముదిమడుగు గ్రామం నుంచి ట్రాక్టర్ కుప్పం ప్రధాన రహదారిలోకి ఉన్నపళంగా రావడంతో కుప్పం వైపు నుంచి వస్తున్న టెంపో ట్రావెలర్ అదుపు చేయలేక రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో టెంపో ట్రావెలర్ డ్రైవర్ తిరుపతికి చెందిన సంజీవ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. హెచ్‌ఎం టివి కెమెరామెన్‌కు గాయాలయ్యాయి. మిగిలిన మీడియా మిత్రులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఢీకొన్న తీవ్రతకు ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఏదిఏమైనా పెను ప్రమాదం తప్పడంతో మీడియా మిత్రులు ఊపిరి పీల్చుకున్నారు. వి.కోట ఎస్ఐ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతి నుంచి వచ్చిన మీడియా ప్రతినిధులను ఇతర వాహనాల్లో పలమనేరుకు మీటింగ్‌కు తరలించారు.



నగిరి పర్యటనలో..



పలమనేరులో..

తిరుపతిలో 'ఆరణి' ప్రచారం

దూరంగానే టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి




జనసేన - టిడిపి - బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు బుధవారం తిరుపతిలో తన ప్రచారాన్ని ప్రారంభించారు. కపిలతీర్థం సర్కిల్ నుంచి జీవకోన వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. నవజీవన్ కాలనీలో గంగమ్మ గుడిలో, జీవకోన జీవలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఇంటింట ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ చిరంజీవి 2009లో జీవలింగేశ్వర స్వామి ఆశిస్సులు పొంది ప్రచారం ప్రారంభించారని, అదే బాటలో తాను ఇంటింటి ప్రచారం ప్రారంభించానన్నారు. జీవకోనలో ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఎ కరుణాకర్‌రెడ్డి అభివృద్ధి పేరుతో అబద్దాల ప్రచారం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం అమృత స్కీం నిధులు తప్ప, రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఒక్క రూపాయి డివిజన్‌లో ఖర్చుచేయలేదన్నారు. జీవకోనలో ఇళ్ల క్రమబద్దీకరణ సమస్యను పరిష్కరించడంలో ఎంఎల్‌ఎ విఫలమయ్యారన్నారు. రానున్న ప్రభుత్వంలో డివిజన్‌లోని ఇళ్లపట్టాల క్రమబద్దీకరణ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కొందరి వల్ల జీవకోనకు చెడ్డపేరు వస్తోందని, తిరుపతి నగరంలో ఏ మూల నేరాలు జరిగినా జీవకోనలో పోలీసులు సోదాలు చేస్తున్నారన్నారు. గంజాయి అమ్మకాలను ఎంఎల్‌ఎ, ఆయన కుమారుడు ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. గంజాయి అమ్మకందారులను శిక్షించి జీవకోనలో ప్రశాంత వాతావరణం నెలకొల్పుతానన్నారు. నగర కార్పొరేషన్ ఛైర్మన్‌ను డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి డమ్మీగా మార్చారన్నారు. జీవకోనలో నిర్మించిన రెండు మాస్టర్‌ప్లాన్‌రోడ్లకు ప్రభుత్వ అనుమతులు లేవని, ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. టిడిఆర్ బాండ్ల పేరుతో ఎంఎల్‌ఎ కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డిలు దోచుకున్న డబ్బును కక్కిస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు గాజు గ్లాసుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మోహన్, సూరా సుధాకర్ రెడ్డి, ఎల్బీ సుధాకర్ రెడ్డి, కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అయితే టిడిపి ప్రధాన నాయకత్వం, జనసేనలో కొంతమంది కూటమి అభ్యర్థి ప్రచారంలో ఎక్కడా కానరాలేదు.

సుగుణమ్మ పరిస్థితే పనబాక లక్ష్మికి..

రెండు స్థానాలిస్తానని ఒక్కటీ లేదు / 'పొత్తు'తో తిరుపతిలో తీవ్ర నిరాశ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో




జనసేన, బిజెపితో టిడిపికి పొత్తు ఏళ్ల తరబడి పార్టీలో సీనియర్లుగా ఉండి, టిక్కెట్ ఆశించి, ప్రతిపక్షంలో ఉండి అధికారపక్షంపై తిరగబడిన వారిని నిరాశ పరచింది. తిరుపతి మాజీ ఎంఎల్‌ఎ ఎం.సుగుణమ్మ పరిస్థితికి భిన్నంగా ఏమీ లేదు మాజీ మంత్రి పనబాక లక్ష్మి కూడా. చంద్రబాబును నమ్ముకుంటే నట్టేట ముంచేశాడని పనబాక దంపతులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని సమాచారం. తిరుపతి ఉప ఎన్నికల సమయంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎన్నికల బరిలో దిగితే ఓటమి తప్పదని తెలిసిన అధిష్టానం మాట ధిక్కరించలేదన్న విషయాన్ని వారు అనుచరగణంతో చెప్పుకుని బాధపడుతున్నారు.

కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పనబాక కుటుంబం ఓ వెలుగు వెలిగింది.. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పనభాక లక్ష్మి కేంద్రమంత్రిగా పనిచేశారు. ఆమె భర్త పనబాక కృష్ణయ్య గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గంలో అభివద్ధి కార్యక్రమాలు చేశారు.. తెలుగుదేశం పార్టీలో చేరిన తర్వాత వారి ప్రతిష్ట మసకబారిందని ఆమె అనుచరులు చెబుతున్నారు.. టిడిపిలో రెండు సీట్లు ఇస్తానని చంద్రబాబు మాటిచ్చారట.. అయితే బిజెపితో పొత్తులో భాగంగా ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడంతో పనబాక దంపతులు చంద్రబాబుపై కన్నెర్ర చేస్తున్నారట.. 1991లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన పనబాక లక్ష్మి.. నెల్లూరు పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున నాలుగు సార్లు ఎంపీగా గెలిచారు ఆమె.. కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉన్న పనబాక దంపతులు.. 2014లో జరిగిన రాజకీయ పరిణామాల అనంతరం 2021 లో తెలుగుదేశం పార్టీలో చేరారు.. అప్పట్నుంచి పార్టీ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేస్తూ వచ్చారు.. అయితే సుళురుపేట అసెంబ్లీ టికెట్ తో పాటు తిరుపతి ఎంపి టికెట్లు ఇస్తానని చంద్రబాబు పనబాక దంపతులకు మాటిచ్చారట.. చివరిదాకా ఎదురుచూసిన రెండు స్థానాలు దక్కకపోవడం పై పనబాక కుటుంబం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుపై తీవ్ర అసంతప్తితో ఉన్నారట.. ఇతర పార్టీల్లోనూ దారులు మూసుకుపోవడంతో రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పనబాక లక్ష్మి అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట.. చంద్రబాబును నమ్ముకుంటే నట్టేట ముంచేసాడని తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతుంది.

తాయిలాల నిల్వలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు: టిడిపి

ప్రజాశక్తి - రేణిగుంట



ఓటర్లను ప్రలోభ పెట్టడానికి రేణిగుంట మండలం రామకష్ణాపురం వద్ద గోదాముల్లో వైసీపీ నేతలు తాయిలాలు దాచిన విషయాన్ని టీడీపీ నేతలు బయట పెట్టినా అధికారులు చర్యలు తీసుకోక పోవడం విచారకమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేవారు. తిరుపతి కలెక్టరు కార్యాలయం వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రామకష్ణాపురం వద్ద నాలుగు గోదాముల్లో వైసీపీ నేతలు తాయిలాలు, ప్రచార సామాగ్రి దాచారన్నారు. ఈ విషయమై తిరుపతి మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మ, పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్ తో కలసి కలెక్టరు డాక్టర్ లక్ష్మీశ కు ఫిర్యాదు చేశామన్నారు. అయితే కలెక్టరు తాను మొదటిసారిగా కలెక్టర్‌గా వచ్చానని, ఎన్నికల నిబంధనలపై పుస్తకాలు చదువుతూ నేర్చుకుంటున్నానని చెప్పడం బాధాకరమన్నారు. ఎన్నికల వేళ తిరుపతికి సీనియర్, అనుభవం ఉన్న కలెక్టర్‌ను నియమిస్తే బాగుంటుందన్నారు. మంగళవారం మధ్యాహ్నం డంప్ గుర్తిస్తే 24 గంటల తరువాత అధికారులు రావడం ఏంటని ప్రశ్నించారు. జీఎస్‌టి అధికారులకు, ఎన్నికల తాయిలాలకు ఏంటి సంబంధం అన్నారు. కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరితే 'సీయాప్'లో ఫిర్యాదు చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాయిలాల నిల్వలపై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇంత జరుగుతున్నా స్పందించని శ్రీకాళహస్తి రిటర్నింగ్ అధికారి తీరు బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిచంద్రారెడ్డి, మహబూబ్‌బాషా, గజేంద్రరెడ్డి, చెర్లోపల్లి సుబ్రమణ్యం రెడ్డి, రెడ్డివారి గురవారెడ్డి పాల్గొన్నారు

'సి' విజిల్ యాప్ ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సీ విజిల్ యాప్, ఈఎస్‌ఎంఎస్ ఫిర్యాదులు, ఎంసిఎంసి ఫిర్యాదుల పరిష్కారం, సన్నద్ధత తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా రాష్ట్ర సచివాలయం సిఇఒ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర అధికారులతో కలిసి పాల్గొన్నారు. సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు గడువులోపు పరిష్కరించేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జేసీ నోడల్ అధికారులతో మాట్లాడుతూ నోడల్ అధికారులందరూ సమన్వయంతో వారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. డిఆర్ఒ పెంచల్ కిషోర్ పాల్గొన్నారు.

బర్డ్‌కు మరో ఆధునిక మణిహారం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు వేగంగా అందిస్తున్న బర్డ్ ఆసుపత్రికి బుధవారం రూ.కోటి విలువచేసే అత్యాధునిక కత్రిమ అవయవాల తయారీ యంత్రాలను సేలంకు చెందిన దాత బాల సుబ్రమణ్యం విరాళంగా అందించారు. బర్డ్ ఆసుపత్రిలో బుధవారం పూజలు నిర్వహించి దాత బర్డ్ ప్రత్యేకాధికారి డా.రాచపల్లి రెడ్డప్పరెడ్డికి అందజేశారు. దీనిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని డా.రాచపల్లి రెడ్డప్పరెడ్డి కోరారు.

జనసేన ఇన్‌ఛార్జిగా వినుత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జిగా కోట వినిత నియమితు లయ్యారు. మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేత పవన్ కళ్యాణ్ బుధవారం నియామక పత్రం అందజేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి వినుత శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జిగా కొనసాగుతున్నారు. మళ్లీ ఆమెనే కొనసాగిస్తూ పవన్ కళ్యాణ్ నియామక పత్రం అందజేశారు. జనసేన పార్టీలో వీర మహిళగా మొక్కవోని ధైర్యంతో వినుత శ్రీకాళహస్తి ప్రజల తరపున పోరాడుతున్నారు.

యాదవులకు పదవులిచ్చినా పెత్తందారులదే పెత్తనం : అన్నా రామచంద్రయ్య యాదవ్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్రవ్యాప్తంగా యాదవులు, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలకు చెందిన వారి ఆర్థిక మూలాలను చిదిమేస్తూ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వైసీపీ ఎమ్మెల్యేలు అనుసరిస్తున్న విధానాలకు మనస్థాపానికి గురై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక, క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని అన్నా రామచంద్రయ్య యాదవ్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించకపోవడం దుర్మార్గం కాదా అన్నారు. ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లోనూ, రాయలసీమలోని ఎనిమిది జిల్లాల్లోనూ యాదవులకు ఒక్క శాసనసభ అభ్యర్థిత్వాన్ని అయిన కేటాయించకపోవడం విస్మయానికి గురి చేసిందన్నారు. రాష్ట్రంలో విశాఖ, తిరుపతి నగరపాలక సంస్థలకు మేయర్లుగా యాదవులకు ప్రాధాన్యం ఇచ్చారే గాని పెత్తనం అంత పెత్తందారీ ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్లు, రీజనల్ కోఆర్డినేటర్ల చేతిలోనే ఉంచుకొని అవమానభారాన్ని మేయర్లపై నెట్టివేశారన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి యాదవ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్ ను మీ ప్రతిభతో మీకు ఈ స్థానం రాలేదు... మా కాళ్లు పట్టుకుంటే ఇచ్చామని అనడం అధికార పార్టీ ఎమ్మెల్యేలు బీసీలపట్ల వారికున్న చిత్తశుద్ధిని బయట పెట్టిందన్నారు. భారత రాజ్యాంగం అందించిన ప్రజాస్వామ్యంలో ఇలాంటి రాచరికపోకడలను అనుసరిస్తున్న వైసిపి పార్టీ నేతల ప్రవర్తనను జీర్ణించుకోలేక రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. నా ఈ రాజీనామా వ్యక్తిగత విషయం మాత్రమేనని, నా కుటుంబ సభ్యుల రాజీనామాలు వారి వ్యక్తిగతమన్నారు.

ఎలక్షన్ ఎటకారం

ఇంతకీ ఎవ్వరు గెలుస్తారబ్బా..!

(సామాన్యుడి సణుగుడు)

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ఎలచ్చన్లు...ఎలచ్చన్లు.. అంటా ఉండినాము ఒచ్చేసినాయి ...క్యాండేట్లు ఎవురు ఎవురు అనుకుంటా ఉండినాము... క్యాండేట్లు ఒచ్చేసినారు... ఇప్పుడు ఎవురు గెలుస్తారు... ఎవురు గెలుస్తారు అనుకుంటా ఉండారు. క్యాండేట్ల కన్నా జనాలకి ఆ ఇది ఎక్కువైపోయింది. రూలింగ్ పార్టీ ఓళ్ళు నవరత్నాలు... నవరత్నాలు అని బటన్ నొక్కతా ఉండారు... సరే బటన్ నొక్కినాక దుగ్గాళ్ళు పడక పోయినా ఎప్పుడో ఒకప్పుడు ఒచ్చినాయిలే... మేము అన్ని ఆమీలు చేసేసినామ్ అని చెప్తా ఉండారు... రోడ్లు.. గీడ్లు.. బిల్డింగులు... కాలవలు.. సెరువులు.. ఏమీ కట్టకపోయా... అదేమంటే మాది సంచేమ పెభుత్వం అని చెప్తా ఉండిరి. పెతిపచ్చం ఓళ్లు సూపర్ సిక్స్ అంటా ఉండారు. నవరత్నాలు కన్నా బాగుంటాయని సూపర్ సిక్స్ అని పెట్టినారాంట.. సిక్స్ తిరగేస్తే 9 ...9 తిరగేస్తే సిక్స్.. జనాల్ని నమ్మించేదానికి ఈ ఇదంగా జేస్తా ఉండారు. రాష్ట్రానికి ఓదా తెస్తాము... పోలారం పూర్తి జేస్తాము... కాలువలు తెప్పిస్తాము...తాగేదానికి నీళ్లు ఇస్తాము... రోడ్లు ఏస్తాము... సదువుకున్న పిలకాయలకి ఉజ్జోగాలిస్తాము... ఆంధ్రని జపాన్ జేస్తాము... సింగపూర్ జేస్తాము అని చెప్పడంలే... నవరత్నాలు... సూపర్ సిక్సులు... జనాలు ఇంకేం పని లేదు అనుకుంటా ఉండారు.. జనాలు జనాల గురించి అనుకోవడం లే... ఆలోచించడం లే... రాజకీయ నాయకుల మాదిరితో ఆలోసిస్తూ ఉండారు.. ఈ ఇదంగా ఉంటే ఎవురు గెలుస్తారు... రాజ"కీయం" గెలస్తాది. జనాలు ఈ ఇసయం తెల్సుకోవాల.... యాం తెలుసు కుంటారో యాందో....

ఆధునిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి : విసి



ప్రజాశక్తి - క్యాంపస్

ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వంగిమల్ల శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంఎక్స్‌ప్లోర్ 2024 కార్యక్రమాన్ని బుధవారం కళాశాలలోని సమావేశ మందిరంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ప్రస్తుత తరుణంలో వస్తున్న నూతన పోకడలు ఆధునిక పరిజ్ఞానం పరిశోధనల పట్ల ఆసక్తిని, అభిరుచిని కలిగి పట్టుదలతో నిరంతర అధ్యయనం చేయాలని సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్ కు మనోవిజ్ఞాన శాస్త్ర అంశాలతో ప్రత్యేకమైన అనుబంధం ఉందని వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్ వి ఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతన అంశాలను శిక్షణ కార్యక్రమాలను అవగాహన చేసుకుని వినియోగించుకోవాలని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య దామోదర్ రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ దివాకర్ రెడ్డి, కన్వీనర్ ఆచార్య హేమ పాల్గొన్నారు.

ఫార్మా విజన్ -2024లో 'సెవెన్ హిల్స్' ఫార్మసీ సత్తా

ప్రజాశక్తి రామచంద్రాపురం



మండలంలోని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు గుంటూరు విజ్ఞాన్ యునివర్శిటీలో జరిగిన మొదటి స్టేట్ లెవెల్ ఫార్మా విజన్ – 2024 సదస్సులో వివిధ విభాగాలలో అవార్డులు అందుకున్నట్లు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. యం. నిరంజన్ బాబు తెలిపారు. ఎ.బి.వి.పి, విద్యార్థి వికాస సమితి సంయుక్తాధ్వర్యంలో గుంటూరు విజ్ఞాన్ యునివర్శిటీ నందు ఫార్మా విజన్– 2024"రెండు రోజుల కాన్ఫరెన్స్ ను ఘనంగా నిర్వహించారు. పలు పోటీలలో సెవెన్ హిల్స్ ఫార్మశ్రీ కళాశాల విద్యార్థులు అవార్డులు గెలిచి నగదు బహుమతులను అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎం.సుమలత అభినందించారు.

వైసిపిని ఆశీర్వదించండి : మేరిగ మురళీధర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి మేరిగ మురళీధర్ ప్రచారం చేశారు. స్థానిక నాయకుల, కార్యకర్తల ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వైసిపి హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయనన్ని సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి సమర్థవంతంగాఅమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి శ్రీనివాసులు, నాగులు, సురేష్ రెడ్డి, గిరిబాబు, కోదండ రామయ్య, సాయి హషీమ్, పూర్ణ, అశోక్, బాలు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో రాంచరణ్ దంపతులు

ప్రజాశక్తి -తిరుమల

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన శ్రీవారిని బుధవారం వేకువజామున దర్శించుకున్నారు. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా సుప్రభాత సేవలో సతీమణి ఉపాసన, కూతురు క్లింకారతో కలిసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందించారు. రాత్రి తిరుమలకు చేరుకున్న రామ్ చరణ్ దంపతులు పద్మావతి నగర్ లోని ఫోనిక్స్ వెంకటేశ్వర నిలయంలో బస చేశారు. రామ్ చరణ్ ను చూసేందుకు అప్పటికే భారీగా అభిమానులు తిరుమలకు చేరుకున్నారు. సెల్ఫీలు దిగడానికి పోటీపడ్డారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-ఓజిలి: వేసవి దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తహశీల్దార్ నాంచారయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమన్ రెడ్డిలు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మోహన్, పిఆర్ ఏఈ చందుకుమార్, ట్రాన్స్కో సబ్ ఇంజనీర్ మునిబాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పాగాలి పంచాయతీ కుమ్మరగుంటకు చెందిన మల్లి అంకయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. పాగాలి గ్రామానికి చెందిన వైసీపీ మండల ఉపాధ్యక్షులు వేణు అక్కడకు చెరుకొని మృతుడి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.5వేలు అందజేశారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో రోటరీక్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. శకుంతలమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఎల్ఎపి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సనత్‌కుమార్ రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని అమ్మడూరు పంచాయతీ పరమాలపల్లికి చెందిన టిడిపి కార్యకర్త పరమాల గోపి ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బొజ్జల బృంద ఆ గ్రామానికి చేరుకొని గోపి భౌతికకాయానికి నివాళులర్పించారు.

తాగునీటిని వృథా చేయకండి: రమేష్‌బాబు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా తాగునీటిని వృథా చేయరాదని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు హితవు పలికారు. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాను తాగునీటి హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ తరపున 294 చేతిపంపులు, 42 పవర్ బోర్లు, తెలుగు గంగ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు నీటి వినియోగం పూర్తయ్యాక కొళాయిలు కట్టేయాలని సూచించారు. ప్రతి కొళాయికి ట్యాప్‌లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు సమకూర్చాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులు సమకూర్చాలని రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు, తహశీల్దార్ అలీఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని 28పంచాయతీల్లోని కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని కల్పించాల్సి సౌకర్యాలు, వసతులకు సంబంధించి అక్కడి సిబ్బందిని ఆరాదీశారు. చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రబాబు నాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్‌కుమార్, వ్యవసాయ అధికారి భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-వెంకటగిరి రూరల్: వెంకటగిరి-నాయుడుపేట రోడ్డులో మార్గంలో ఎన్నికల కమిషనర్ అదే అసలు మేరకు వాహనాలు తనిఖీలు బుధవారం నిర్వహించారు. ఎన్నికలలో నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ శంషిద్ బేగం, కానిస్టేబుల్ వాహనాలను నిలిపి ఎన్నికల నిబంధనలను పాటించకుండా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా నివారించేందుకు చర్యలు చేపట్టారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళావర్సిటీ

ఇంకుబేషన్ సెంటర్‌కు నిధులు మంజూరు


ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో జీవసంకేతిక విజ్ఞాన విభాగం బయోటెక్నాజీ పారిశ్రామిక పరిశోధన సహాయ మండలి, న్యూఢిల్లీ నిధులతో ఏర్పాటైన మహిళా వర్శిటీ ఉమెన్ బయోటెక్ ఇంకుబేషన్ ఫెసిలిటీకి నిధులు మంజూరైనట్లు వీసీ తెలిపారు. మూడవ సంవత్సర విడతగా మంజూరైన రూ.47.9లక్షల విడుదలకు సంబంధించిన పత్రాన్నీ వర్శిటీ విసి భారతి, రిజిస్ట్రార్ రజని సెంటర్ సీఈఓ కళారాణి, ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ విద్యావతికి అందజేశారు.

వేలం వాయిదా

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి):
చంద్రగిరి పంచాయతీ వారపు సంత తదితరాలుకు సంబంధించి బహిరంగ వేలం వాయిదా పడింది. 2024-25 వ సంవత్సరానికి గురువారం జరగాల్సిన బహిరంగ వేలం వాయిదా వేస్తున్నట్లు సర్పంచ్ రూప రామ్మూర్తి, ఈవో మహేశ్వరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం తిరుపతి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి తదుపరి ఉత్తర్వులు పొందిన పిదప వేలంపాట నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

అలుపెరుగని పోరాటయోధుడు

సురేందర్‌రెడ్డి: సిహెచ్ శంకర్రావు



ప్రజాశక్తి - రేణిగుంట: సిఆర్ఎస్ రైల్వే కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన యోధుడు సిఆర్‌యస్ మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ, వర్క్ షాప్ డివిజనల్ సెక్రటరీ సురేందర్ రెడ్డి అని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సిహెచ్ శంకర్రావు స్పష్టం చేశారు. బుధవారం క్యారేజ్ రిపేర్ షాప్ నందు ఉన్న మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ సురేందర్ రెడ్డి ఈనెల పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా రైల్వే ఇన్స్టిట్యూట్ నందు సన్మాన సభ రిటైర్మెంట్ ఫంక్షన్ నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆఫీస్ బేరర్స్ మురళీధరన్, ఉదయ భాస్కర్, సిఆర్ఎస్ బ్రాంచ్ యూనియన్ నాయకులు రాజేష్, కుటుంబ సభ్యులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తే చర్యలు: సెబ్ సీఐ

ప్రజాశక్తి-కోట:
అక్రమంగా మద్యం తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ సీఐ దేవర శ్రీనివాసులు తెలిపారు. బుధవారం వాకాడు ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ దేవ ర శ్రీనివాసులు మాట్లాడుతూ మద్యం, నాటుసారా, కోడి పందాలుపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు.

వెటర్నరీ కళాశాల అధ్యాపకులపై

చర్యలు తీసుకోండి: డాక్టర్ నాగేశ్వరరావు



కళాశాల ప్రిన్సిపాల్‌కి విన్నవిస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి వెటర్నరీ కళాశాలలో బోధన సిబ్బందిగా పనిచేస్తూ కాలేజ్ పనివేళలో కాలేజ్‌లో ఉండకుండా వారి సొంత క్లినిక్‌లో ఉంటూ అక్కడ చికిత్స చేస్తున్న బోధన సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ అయినటువంటి డాక్టర్.జగపతి రామయ్యాయితీ ఏపీ వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్. యూ.నాగేశ్వరరావు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్. నాగేశ్వరరావు మాట్లాడుతూ కాలేజ్‌లో పనిచేస్తున్న అనేక మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కళాశాల పని వేళలో బయట వారి సొంత లాభం కొరకు డబ్బును ఆర్జించే పనిలో పడి వారి యొక్క ఉద్యోగ భాద్యత అయినటువంటి కళాశాలలో చదువుకునే విద్యార్థుల భవిష్యత్‌ని కాలరాస్తున్నారన్నారు. ఈ విధంగా భారత పశువైద్య మండలి నియామాలు ఉల్లగించే అసిస్టెంట్ ప్రొఫెసర్లు పై కమిటీ వేసి సమగ్రవిచారణ జరిపించి అటువంటి అధ్యపకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ బీసీ విద్యార్థి విభాగం అధ్యక్షులు విజయ్ ఉత్తరాది, యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ సురేష్ పాల్గొన్నారు.

శ్రీసిటీలో విదేశీ బృందం సందర్శన



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ఫ్రాన్స్ పరిధిలోని రీయూనియన్ ఐలాండ్‌కు చెందిన ఉన్నతశ్రేణి ప్రభుత్వ ప్రతినిధుల బృందం బుధవారం శ్రీసిటీని సందర్శించింది. బృందంలోని రీయూనియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (సీసీఐ) సెక్రటరీ రిచర్డ్ బౌకీ క్విని, ప్రెసిడెంట్ జానీ అర్నాచెల్లమ్, రీయూనియన్ ఐలాండ్ డిప్యూటీ మేయర్ బెర్నార్డ్ రాబర్ట్, ఫ్రాన్స్‌లోని గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ పీపుల్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ డైరెక్టర్ రాజారామ్ మోహన్ మునుస్వామి, సదరన్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మేనేజర్ భవానీ సమ్మారావులకు శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) శివశంకర్ వారికి సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక నగరం ప్రగతి, ప్రత్యేకతలు, వ్యాపారానుకూల పర్యావరణ వ్యవస్థ గురించి వివరించారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు పరిశీలించడం, వ్యాపార సామర్థ్యాన్ని అంచనా వేయడం, పెట్టుబడి అవకాశాలను గుర్తించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యం కాగా, ఈ మేరకు శ్రీసిటీ అధికారులతో చర్చల సందర్భంగా వివిధ అంశాలపై ప్రశ్నలడిగి రీయూనియన్ ప్రతినిధులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలతో పాటు రాక్వర్ట్ పరిశ్రమను వారు సందర్శించారు. శ్రీసిటీ మౌళిక సదుపాయాలు, పరిశ్రమల అనుకూల వాతావరణం తమను ఎంతగానో ఆకట్టుకుందన్న ప్రతినిధులు, భారీ పారిశ్రామికవాడ అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్యం కృషిని అభినందించారు. ఈ పర్యటనపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 29 దేశాలకు చెందిన ప్రముఖ కంపెనీలు శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టాయన్న ఆయన, మరిన్ని దేశాలు ఈ వరుసన చేరేందుకు ఈ తరహా పర్యటనలు మార్గం సుగమం చేస్తుందన్నారు.

క్రైం కార్నర్

డంప్ చేసిన ఎర్ర దుంగలు స్వాధీనం

- ఒకరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): డంప్ చేసిన ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. వివరాలను బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నిర్వహించిన సోదాల్లో నాయుడుపేట సమీపంలోని అత్తివరం అటవీ ప్రాంతంలో 51ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. నిందితుడు రైల్వే కోడూరుకు చెందిన సయ్యద్ ఎలియాస్ బాషా(27)గా గుర్తించినట్లు తెలిపారు. ఎస్ఐ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గూడూరుటౌన్: మండల పరిధిలోని తిరువెంగళాయపల్లి సమీపంలో కారు ఢీకొని స్కూటరిస్ట్ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. రూరల్ ఎస్.ఐ కథనం మేరకు బాలాయపల్లి మండలం నిడలి గ్రామానికి చెందిన పల్లేపు వెంకటాద్రి(28) పనుల నిమిత్తం గూడూరు నుండి నిండలికి వెళ్తుండగా, అదే మార్గంలో వెంకటగిరి నుండి వస్తున్న కారు తిరువెంగలయ పల్లి దగ్గర స్కూటర్‌ని ఢీ కొట్టడంతో స్కూటరిస్ట్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ తరలిస్తున్న వాహనాలు సీజ్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్, జెసీబీని సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పెళ్లూరు పంచాయతీలోని చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వేస్తున్న అందిన సమాచారంతో దాడుల చేశామన్నారు. ట్రాక్టర్, జేసీబీని సీజ్ చేసి మైనింగ్ సమాచారం తెలియజేసినట్లు చెప్పారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవన్నారు.

బీసీలకే అధిక ప్రాధాన్యం: మేయర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వైసిపి అధినాయకత్వం సీట్లను కేటాయించిందని, అన్నా రామచంద్రయ్య యాదవ్ చేసిన ఆరోపణలపై నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష బుధవారం ప్రెస్‌క్లబ్‌లో స్పందించి మాట్లాడారు. వైసీపీలో ఇమడలేక అన్నా రామచంద్రయ్య యాదవ్ అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. తిరుపతి అభివృద్ధి కోసం పదవులను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేస్తున్నామని, ఇందులో ఎవరికి ప్రాధాన్యత అని ఏనాడు చూసుకోలేదన్నారు. సమావేశంలో తాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ గోపి యాదవ్, శరత్ యాదవ్, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, కార్పొరేటర్లు ఉమాయాదవ్, గీతా యాదవ్, నాయకులు శీను యాదవ్ పాల్గొన్నారు.



వినాయక స్వామి

ఆలయంలో కుంబాభిషేకం

ప్రజాశక్తి-రామచంద్రపురం:
మండలంలోని పుల్లమ నాయుడు కండ్రిగలో కొత్తగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ కుంబాభిషేకం వైభవంగా జరిగింది. బుధవారం కుంభాభిషేకం కార్యక్రమానికి వైసిపి నేత చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. కుంబాభిషేక ఉత్సవంలో పాల్గొని స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆదరించండి: కురుగొండ్ల

ప్రజాశక్తి-వెంకటగిరి: ఎన్నికల్లో తన బిడ్డ లక్ష్మీసాయి ప్రియకు ఓటు వేసి ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రజలను వేడుకున్నారు. బుధవారం పట్టణంలోని మనులాలపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట రాజేశ్వరరావు, రాజేశ్వరరావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా బాలాయపల్లి మండలంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఒక్కటైయ్యారు..



ప్రజాశక్తి-పిచ్చాటూరు: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం ఆధ్వ ర్యంలో మండలంలోని టీడీపీ నాయకులు ఇలంగోవన్ రెడ్డి, తిరుమల రెడ్డి ఒక్కటైన వేల ఆనంద ఉత్సాహముతో టిడిపి కార్యకర్తలు నాయకు లు ముని తేలారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర నాయుడు, పద్దు రాజు, అరుణ్ ప్రకాష్, రవి, చిన్న, వాసు పాల్గొన్నారు.

'ఆరణి కోసం పనిచేస్తాం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి కూటమి అభ్యర్థిగా తిరుపతి బరిలో ఉన్న ఆరని శ్రీనివాసులు గెలుపు ఖాయమని, తిరుపతిలో ఉన్న కాపులంతా శ్రీనివాసులు గెలుపు కోసం పనిచేస్తామని ఏపీ రాష్ట్ర కాపు నాడు ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీ అధ్యక్షులు సరిత నాగరాజు రాయల్, ప్రధాన కార్యదర్శి, గుట్టా నాగరాజ రాయల్ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ టీడీపీ హాయంలో తిరుపతి నగరంలో కాపు భవన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక కాపు భవన్ నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయించుకొని, తిరుపతి ప్రజలకు భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సమావేశంలో జనార్ధన్, జనార్ధన్, ప్రభాకర్, డాక్టర్ కరుణానిధి, మురళి పాల్గొన్నారు.

ఆశీర్వదించండి: నెలవల

ప్రజాశక్తి-పెళ్లకూరు: మండలంలోని చెంబెడు పంచాయతీలో టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మల్లిరెడ్డి, మస్తాన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, మురళీకృష్ణారెడ్డి, కృష్ణయ్య, నాగేందర్‌రెడ్డి, శివకుమార్, ప్రసాద్‌నాయుడు, శేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పిస్తాం: బొజ్జల



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: మహిళా భద్రత టిడిపికే సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకురాలు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కైలాసగిరి కాలనీలో టిడిపి ఆధ్వర్యంలో మహిళల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, సుమతి, రమేష్, మీర్జా, బాబు రెడ్డి, సురేష్, తులసి, ద్రాక్షయని, కుమారి, అనూష, పద్మ చంద్రకళ పాల్గొన్నారు.

చంద్రగిరిలో వైసీపీకి బిగ్ షాక్



ప్రజాశక్తి-రామచంద్రపురం(తిరుపతి రూరల్): చంద్రగిరి వైసిపికి గట్టి షాక్ తగిలింది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్వగ్రామమైన తుమ్మలగుంటకు చెందిన రాష్ట్ర సాహితీ అకాడమీ డైరెక్టర్ దొడ్ల గౌరి, వైఎస్సార్ యువజన విభాగం జనరల్ సెక్రటరీ దొడ్ల కరుణాకర్ రెడ్డి, నరసింహమూర్తి, రేవంత్‌లు వైసీపీని వీడి బుధవారం టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు.

బాలాయపల్లిలో..

ప్రజాశక్తి-బాలాయపల్లి: మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం బాలాయపల్లి మండలంలోని కామకూరు గ్రామం మాజీ సర్పంచ్ సర్వేపల్లి కిరణ్మయి, పట్టెం రమణయ్య, పాలమాని వెంకటేశ్వర్లు, చింతల మస్తాన్, సర్వేపల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు.

వైసీపీలో చేరిక

ప్రజాశక్తి-పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు గ్రామంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆరు గ్రామాలకు చెందిన పలువురు వైసీపీలో వైసీపీలో చేరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సంజీవయ్య విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

చంద్రగిరికి చెందిన మితిలేష్..

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం దోర్నకంబాల పంచాయతీకి చెందిన మితిలేష్ వైసీపీ కండువా కప్పుకున్నారు. బుధవారం తుడా ఛైర్మెన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో చేరారు.



వైసీపీలో చేరుతున్న మితిలేష్

మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ విస్తరణ విద్యా కేంద్రం, మహిళా అధ్యయన కేంద్రం, పాపులేషన్ స్టడీస్ అండ్ సోషల్ వర్క్ విభాగం సంయుక్తంగా మాదకద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ ఆచార్య పద్మనాభం మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం సమాజంలో పెను భూతంలా విస్తరిస్తోందని దాన్ని అరికట్టడానికి ప్రధాన మార్గం యువతకు మానసిక పరిపక్వతను కల్పించి సమాజంలో వాటి వినియోగాన్ని అరికట్ట వచ్చని, మనసును అదుపులో ఉంచుకోవడానికి ధ్యానం యోగ వంటి కార్యక్రమాలతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకొని వాటిని మన జీవన విధానంలో భాగం చేసుకుంటే వ్యక్తి ఈ దుర అలవాట్లకు లోను కాకుండా చూడవచ్చని తెలియజేశారు.

కాంగ్రెస్ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- వికోట: రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధించాలంటే అది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని పలమనేరు కాంగ్రెస్ పార్టీ ఆశావాహ అభ్యర్థి శివశంకర్ తెలిపారు. మండల కేంద్రమైన వికోటలో బుధవారం కాంగ్రెస్ పార్టీ యువనేత శివశంకర్ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు ప్రత్యామ్నాయ పార్టీ కోసం ఎదురుచూస్తున్నారని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అందర్నీ కలుపుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తానన్నారు. కార్యక్రమంలో నేతలు ఇనయ తుల్లాఖాన్, నాగరాజు, శివన్న, గురువిరెడ్డి, విక్కీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని పొగురుపల్లి, కే.గొల్లపల్లి, చింతలపాలెం, కోట, చెంబగిరి, ఒంటిపల్లి గ్రామాలపరిధిలో గురువారం 33/11కేవి దాసమానుపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ నియంత్రణ సామర్థ్యం 5 యంవిఎ నుండి 8 యంవిఎ పెంచడం కొరకు పనులు చేపట్టడం వలన ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని రెస్కో ఎండి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం కోటపల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్సీ భరత్ తరపున ఆయన భార్య ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒకసారి తన భర్తకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకొని వెళ్తామని ఆమె గడపగడపకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. జడ్పీటిసి కృష్ణమూర్తి, మంజునాథ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ డాక్టర్ థామస్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఎస్ఆర్.పురం మండలంలోని జిఎంఆర్.పురం గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. థామస్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

'పామాయిల్‌తో ఉపయోగాలు'

ప్రజాశక్తి-తిరుపతి సిటీ:
పామ్ ఆయిల్ ఒక వైవిధ్యమైన, విస్తృతంగా ఉపయోగించే వంటనూనె అని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. స్థానిక హోటల్‌లో వారు విలేకర్లతో మాట్లాడుతూ పామాయిల్ కలినరి ఉపయోగాలకు మాత్రమే కాకుండా అందులో సమృద్ధిగా పోషకాలు కూడా ఉన్నాయన్నారు. మనం ఇష్టపడే వంటకాల రుచి, అకృతిని మెరుగుపరచడమే కాకుండా పామాయల్ చురుగ్గా దోహదపడే పోషకాలు, విలక్షణమైన మిశ్రమాన్ని కలిగి ఉందన్నారు. పామాయిల్ నుండి పొందిన ఘనమైన కొవ్వులను ఎంచుకోవడం, ఒక ఆరోగ్యాకరమైన ఎంపిక అన్నారు. ఇది హైడ్రోజనేషన్ ప్రక్రియను నివారిస్తుందని పేర్కొన్నారు. పామాల్లోని విటమిన్ ఈ సహజ వృద్యాప నెమ్మదింప చేస్తుందని వివరించారు.

కలకలం రేపిన ఐటీ దాడులు

- టీడీపీ నేత ఇంటిలో సోదాలు




ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతిలో ఐటీ దాడులు కలకలం రేపాయి. బుధవారం టీడీపీ నేత కోడూరు బాలసుబ్రమణ్యం ఇంటిలో ఐటీ అధికారులు 15మంది బృందం దాడులు చేపట్టారు. ఈ విషయంపై బాలసుబ్రమణ్యం మీడియాతో మాట్లాడుతూ ఐటీ దాడులు చేపట్టి భయభ్రాంతులకు గురి చేయడం బాధాకరమన్నారు. ప్రజాక్షేత్రంలో గెలవకుండా అధికారులను పురిగొల్పి భయపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని ఎద్దేవా చేశారు. ఆకస్మాత్తుగా చేపట్టిన ఈ దాడుల్లో వారికి ఎలాంటివి దొరకకపోవడంతో వెనుదిరిగినట్లు ఆయన తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

ప్రజాశక్తి-పెళ్లకూరు: మండలంలో ఉన్న ఏకైక ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రంలో బుధవారం పది పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. 18న ప్రారంభమైన పరీక్షలు బుధవారంతో ముగిసాయి. ఈ సెంటర్‌లో పాలచూరు, నెలబల్లి, పెళ్లకూరులో ఉన్నత పాఠశాల విద్యార్థులు 81 మంది పరీక్షలు రాశారు. కాగా ఆఖరి రోజున ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

క్షేత్రస్థాయిలో 'ఓటరు చైతన్య కార్యక్రమాలు'



నోడల్ టీం అధికార్ల సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ పరిధిలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ద్వారా ఓటరు చైతన్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా చేపట్టాలని ఏఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ స్వీప్ నోడల్ టీమును ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై నోడల్ టీం అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాలను పోలింగ్ బూత్ స్థాయిలో చేపట్టాలన్నారు. కొత్తగా ఓటు హక్కునమోదు చేసుకున్న యువ ఓటర్లు, మహిళలు, వద్దులకు ఓటు హక్కు ప్రాధాన్యత, నైతికంగా ఓటు హక్కు వినియోగం, ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక, అతి సమస్యత్మక ప్రాంతాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటర్లను చైతన్యపరిచేలా వివిధ కార్యక్రమాలను రూపొందించి, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన పెంచాలన్నారు. 'నేను తప్పకుండా ఓటు వేస్తాను' అనే స్వీప్ సందేశాన్ని ఓటర్లలోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చేపట్టబోయే స్వీప్ కార్యక్రమాలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి, కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన స్వీప్ అవగాహన కార్యక్రమం

విద్యార్థులకు ఓటు హక్కు, ఓటు విలువ పైన అవగాహన కల్పిస్తూ స్థానిక చిత్తూరు విజయం డిగ్రీ కళాశాలలో జరిగిన స్వీప్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు డిఎంకె తులసి విచ్చేశారు. ఈ సభను ఉద్దేశించి డిఆర్‌డిఎ పిడి తులసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సివిజిల్, ఓటర్ హెల్ప్ లైన్, సాక్ష్యం యాప్‌ల పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటు పైన చైతన్యం కల్పించే లఘు చిత్రాలను విద్యార్థులకు చూపించారు. జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్, జేడిఎం సరితా రెడ్డి, విజయం కాలేజీ కరస్పాండెంట్ రాజగోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పిడి తులసి